సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 21 । జనవరి । 2025



మంత్రి ఇలాకాలో బెల్టు షాపుల జోరు..! - 8లో

ఊరూరా బెల్ట్‌షాపులు వెలస్తున్నాయి. మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.



చీపురుపల్లిలో చోరీ కలకలం

చీపురుపల్లి పట్టణంలో ఒకే రోజు మూడు ఇళ్లలో జరిగిన చోరీలు స్థానికుల్లో కలకలం సృష్టించాయి. - 8లో

న్యూఢిల్లీ వెళ్లిన పీఓ

సీతంపేట: న్యూఢిల్లీలో గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరగనున్న జన్‌మాన్ ప్రోగ్రాం కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి వెళ్లారు. కలెక్టర్లు, ఐటీడీఏ పీఓలతో జరగనున్న కాన్ఫరెన్స్‌కు సీతంపేట ఐటీడీఏ తరఫున పీఓ హాజరుకానున్నారు.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



వెంకటేష్‌కు ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస కాలనీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అవలంగి గ్రామానికి చెందిన బి.వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు తన ద్విచక్రవాహనంపై వీరఘట్టం నుంచి స్వగ్రామం వస్తుండగా పాలకొండ నుంచి ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్నవారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడగా, ఆటోడ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపు!

పార్వతీపురం: అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో 50 ఏళ్లు నిండిన వారందరికీ వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేస్తామని ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. అధికారం చేపట్టి ఏడు నెలల పూర్తయినా కొత్త పింఛన్ల ప్రస్తావనే లేదు. చాలామంది వితంతువులకు కూడా పింఛన్లు మంజూరుకాలేదు. 60 ఏళ్లు నిండిన వారికి కూడా కొత్తగా పింఛన్లు మంజూరు కాకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారంటూ అర్హులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే, కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని, మళ్లీ రావాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చెబుతుండడంతో అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు, రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేదని, నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం వెబ్‌సైట్ ఓపెన్ చేయకుండా కాలయాపన చేయడంపై మండిపడుతున్నారు. కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడు అవకాశం ఇస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

సజావుగా కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ



హైజంప్ చేస్తున్న అభ్యర్థి

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు సజావుగా సాగుతున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సోమవారం నిర్వహించిన పరీక్షలకు 651 మందికి 446 మంది అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. నియామక ప్రక్రియను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, పలువురు అధికారులు పర్యవేక్షించారు.

ఆర్‌ఎస్‌కే పరిశీలన



సిరిపురం ఆర్‌ఎస్‌కేలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీటీ మూర్తి, ఏఓ శ్యామ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: రైతుల నుంచి బస్తాకు అదనంగా రెండు కేజీలు చొప్పున మిల్లర్లు వసూలు చేస్తున్నారనే అంశంపై 'ఇదేం దోపిడీ..!' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయ, సివిల్ సప్‌లై అధికారులు స్పందించారు. గంట్యాడ మండలంలోని సిరిపురం రైతు సేవా కేంద్రం (రైతు భరోసా కేంద్రం)ను సివిల్ సప్‌లై డీటీ మూర్తి, మండల వ్యవసాయ అధికారి బి.శ్యామ్‌కుమార్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డులు, ట్రక్ షీట్లను తనిఖీచేశారు.

110 ఏళ్ల వృద్ధురాలు మృతి



దిండి రాములమ్మ (ఫైల్)

గుర్ల: మండలంలోని రాగోలులో 110 ఏళ్ల వయస్సు గల వృద్ధురాలు దిండి రాములమ్మ సోమవారం మృతి చెందింది. ఆమె మృతి చెందిన వరకు ఎటువంటి అనారోగ్యం దరి చేరలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కరోనాను సైతం జయించిందంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో అత్యధిక వయస్కురాలు మృతి చెందడంపై విచారం వ్యక్తంచేశారు. మృతురాలికి ముగ్గురు మగ పిల్లలు, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

పనులు చేయరు.. నీరు వదలరు..!

- తోటపల్లి ఆయకట్టు రైతులకు కూటమి వెన్నుపోటు
- రూ.193 కోట్లతో జరుగుతున్న ఆధునికీకరణ పనులను రద్దు చేసిన ప్రభుత్వం
- రబీ సాగుకు నీరు విడిచిపెట్టని జలవనరులశాఖ అధికారులు
- వాస్తవంగా పనులు చేసేందుకు అదును ఇదే..
- కాలువల పనులు చేపట్టకపోతే ఆయకట్టు శివారు భూములకు సాగునీరు ప్రశ్నార్థకమే..
- తోటపల్లి పాత ఆయకట్టు సుమారు 64 వేల ఎకరాలు
- ఆవేదనలో రైతన్న



పనులు నిలిచిపోవడంతో కత్తులకవిటి వద్ద వెలవెలబోతున్న పాత ఆయకట్టు ఎడమకాలువ

వీరఘట్టం:

తోటపల్లి జలాశయం.. పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రైతులకు సాగునీటి ఆదరువు. ప్రాజెక్టులో నీరున్నా కాలువలు అభివృద్ధి చేయకపోవడంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. గతంలో విడుదల చేసిన రూ.193 కోట్ల ఖర్చుతో జరుగుతున్న పాత ఆయకట్టు కాల్వల ఆధునికీకరణ పనులను టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దుచేయడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. వాస్తవంగా కాలువల పనులు చేపట్టేందుకు ఇదే అదును. ఇప్పటి నుంచి నిరంతరాయంగా 6 నెలల పాటు పనులు చేపడితే వచ్చే ఖరీఫ్ సీజన్‌లో పుష్కలంగా శివారు భూములకు సాగునీరందించవచ్చు. ప్రభుత్వ తీరుతో పాత ఆయకట్టు పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న ఖరీఫ్ సీజన్‌కు శివారు భూములకు సాగునీరు ప్రశ్నార్థకమేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలువల పనులు నిలిచిపోయాయి... జలాశయంలోని నీటిని రబీ పంటల సాగుకు విడిచిపెట్టాలని రైతులు విజ్ఞప్తిచేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. నీరు విడుదల అంశం తమ చేతిలో లేదంటూ జలవనరులశాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

రబీ సాగుకు నీటి ఎద్దడి

తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనులు ఆగినందున కనీసం ఈ రబీలోనైనా తోటపల్లి పాత ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని ఇటీవల నూతనంగా ఎంపికైన 25 మంది నీటి సంఘాల అధ్యక్షులు, టీసీలతో కలిసి జలవనరులశాఖ అధికారులను కోరారు. తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలో ఉన్న కుడి, ఎడమ కాలువల్లో ఆధునికీకరణ పనులను ప్రభుత్వం రద్దు చేసిందని జలవనరులశాఖ అధికారులు స్పష్టం చేశారని, ప్రాజెక్టుల్లో గరిష్ట నీటి మట్టం 105 మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 104.15 మీటర్లు ఉందని, పాత ఆయకట్టు కాలువల ద్వారా రబీ సాగుకు నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినా కుదరదని ప్రాజెక్టు అధికారులు తేల్చిచెప్పడం గమనార్హం.



ఖరీఫ్ పరిస్థితి?

రబీకి సాగునీరు విడుదల చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. మరి రానున్న ఖరీఫ్‌కు పాలకొండ శివారు వరకు నీరు వస్తుందా అంటే అది కూడా ప్రశ్నార్థకంగానే మారింది. పాత ఆయకట్టు కాలువల కింద సుమారు 64 వేల ఎకరాల సాగుభూమి ఉంది. ఏటా ఖరీఫ్‌లో జూలై, ఆగస్టు నెలల్లో సాగునీరు విడుదల చేస్తున్నారు. నవంబర్ నెలాఖరున నీటిని నిలుపుదల చేస్తున్నారు. రెండు పంటలకు నీరివ్వాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడడం లేదు. ప్రస్తుతం కాలువ పనులకు వాతావరణం అనుకూలంగా ఉన్నా పనులు చేయకుండా తోటపల్లిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తుండడంపై రైతన్నలు మండిపడుతున్నారు. ఇప్పుడు పనులు చేపట్టకపోతే రానున్న ఖరీఫ్‌కు సాగునీరు వస్తుందా అని ప్రశ్నిస్తున్నారు.

నమ్మించి మోసం చేశారు..



గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులను శరవేగంగా పూర్తి చేసి మూడు పంటలకు నీరిస్తామ ని నమ్మబలికారు. ఇప్పుడేమో కాలువ పనులు 25 శాతం కూడా పూర్తి కానందున తోటపల్లిని ప్రాధాన్యత ప్రాజెక్టుల నుంచి తప్పించారు. ఫలితంగా తోటపల్లి పాత ఆయకట్టు కాలువల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయా యి. కాలువ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని చెప్పింది కూటమి నాయకులే... ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి ప్రతిపక్ష నాయకుడి హోదాలో వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇక్కడ సెల్ఫీ కూడా తీసుకున్నారు.. తీరా అధికారం చేపట్టాక తోటపల్లి ప్రాజెక్టు పాత ఆయకట్టు పనులను నిలిపివేయడంపై రైతులు మండిపడుతున్నారు. నమ్మించి మోసం చేశారని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి...

2014–19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులు కేవలం 9 శాతం మాత్రమే జరగగా అప్పటి టీడీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా బిల్లులు చెల్లించలేదు.

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019–24 వరకు 14 శాతం పనులు పూర్తిచేసింది. రెండు విడతలకు 2021 మార్చి 31న రూ.15.96కోట్లును, తర్వాత 2022 మార్చి 31న రూ.7.63కోట్లను అప్పటి వరకు జరిగిన పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. ఇంత వరకు 23 శాతం పనులు మాత్రమే జరిగాయని చెప్పి తోటపల్లి ఆధునికీకరణ పనులను రద్దుచేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులు పూర్తిచేసేలా చూడాలే తప్ప పనులను రద్దు చేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇచ్చాం

తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులు 25 శాతం కంటే తక్కువ జరిగినందున ఈ పనులు ప్రభుత్వం నిలిపివేసింది. ప్రస్తుతం పనులు చేపట్టేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని, ఇక్కడ రైతుల పరిస్థితి, వారి జీవనాధారంపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇచ్చాం. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– వై.గన్నిరాజు, డీఈఈ, జలవనరులశాఖ, పాకొండ డివిజన్

పనులు వెంటనే ప్రారంభించాలి



తోటపల్లి పాత ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని ఎన్నికల ముందు రైతాంగానికి కల్లబొల్లి మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం ... ప్రస్తుతం ప్రాధాన్యతా జాబితా నుంచి తోటపల్లి ఆధునికీకరణ పనులను తప్పించడం సరైన విధానం కాదు. తోటపల్లి కాలువ పనులు పూర్తి చేస్తారని మిమ్మల్ని నమ్మి ఓట్లు వేసిన రైతన్నలను మోసం చేయడం పద్ధతి కాదు. ఆపేసిన తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనులను వెంటనే ప్రారంభించాలి.

– జంపు కన్నతల్లి, జెడ్పీటీసీ సభ్యురాలు, వీరఘట్టం

చిత్తశుద్ధి ఉంటే పనులు చేయండి



ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన మాటను కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే నిలబెట్టుకోవాలి. ఇలా అర్ధాంతరంగా కాలువ పనులు నిలిపివేయడం పద్ధతికాదు. రబీకి నీరవ్వనన్నారు... కనీసం ఖరీఫ్ నాటికైనా కాలువ పనులు చేపట్టి శివారు ఆయకట్టుకు నీరందేలా చొరవ చూపాలి.

– కర్రి లీలాప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, నడుకూరు, వీరఘట్టం మండలం

మరో బాదుడుకు సిద్ధం..

- వచ్చే నెల ఒకటో తేదీ నుంచి భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ ధరలు
- ఇప్పటికే పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- జిల్లా పరిధిలో 13 రిజిస్ట్రార్ కార్యాలయాలు
- 24వ తేదీ వరకు అభ్యంతరాలకు గడువు
- జిల్లా కమిటీ ఆమోదం లాంఛనమే



దాసన్నపేటలోని రిజిస్ట్రార్ కార్యాలయం

విజయనగరం రూరల్: భూములు, స్థలాలు, నిర్మాణాల విలువలను అమాంతం పెంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కనబెట్టి వరుసగా ప్రజలపై మోయలేని భారాలు మోపుతోంది. ఒకపక్క నిత్యావసర ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుంటే.. మరోపక్క విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజల నడ్డివిరిచిన కూటమి ప్రభుత్వం తాజాగా భూముల మార్కెట్ విలువ రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచేందుకు సిద్ధమైంది. 2025 నూతన సంవత్సర కానుకగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నట్లు సమాచారం.

పెరగనున్న ఆర్‌సీసీ నిర్మాణాల ధరలు

కొత్త నిబంధనల ప్రకారం ఆర్‌సీసీ నిర్మాణాల ధరలు భారీగా పెరగనున్నాయి. కార్పొరేషన్లు, మున్సిపాల్టీల పరిధిలోని అపార్ట్‌మెంట్‌లలో మొదటి, రెండవ అంతస్తులలో ప్లాటుకు ఒక్కో చదరపు గజానికి రూ.90 పెరగనుంది. ఇప్పటివరకు చదరపు అడుగుకు రిజిస్ట్రేషన్ విలువ రూ.1400 ఉండగా దీన్ని ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రూ. 1490కి పెంచనున్నారు. కొన్ని మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లోనూ చదరపు అడుగుకు రూ.70 పెంచుతున్నారు. మూడో అంతస్తు నుంచి మాత్రం గతంలో వసూలు చేసే రేట్లనే కొనసాగిస్తున్నారు. వాణిజ్య భవనాలకు మాత్రం గతంతో పోల్చిచూస్తే రిజిస్ట్రేషన్ విలువ రూ.100 పెరగనుంది. ధరల పెంపునకు సంబంధించి ఇప్పటికే సంబంధిత అధికారులు రంగం సిద్ధం చేశారు.

ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు..

ఆదాయం పెంచుకోవడమే పరమావధిగా కూటమి ప్రభుత్వం జిల్లాలో భూములు విలువల పెంపునకు సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా అధికారులు పెంపు నివేదికలను సిద్ధం చేసి ముసాయిదాను జిల్లాలో ఉన్న 13 రిజిస్ట్రార్ కార్యాలయాల నోటీస్ బోర్డులో ఉంచారు. ఈ నెల 24 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలిస్తారు. ఈ నెల 27న తుది జాబితాకు జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలియజేయనుంది.

కొత్తగా నిర్ణయించిన ధరలు

నిర్మాణం	పట్టణం	పంచాయతీ
అపార్ట్‌మెంట్	రూ. 1490	రూ. 900
సెల్లార్ పార్కింగ్	960	640
3వ అంతస్తు నుంచి	1,520	920
వాణిజ్యభవనం కింద అంతస్తు	1800	1060
మొదటి అంతస్తు	1700	1010
రెండవ అంతస్తు నుంచి	1590	950
సెల్లార్ పార్కింగ్	1040	740
షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్	1590	950
సినిమాహాల్స్, కర్మాగారాలు	950	690
మిల్లులు, ఫ్యాక్టరీలు	రూ.690	రూ.490

బిళ్లలవలసలో డయేరియా

- మూడు రోజుల వ్యవధిలో వ్యాధిబారినపడి 16 మంది అస్వస్థత
- వీరిలో 8 మందికి వివిధ ఆస్పత్రుల్లో వైద్యసేవలు
- కలుషిత ఆహారమే కారణమని తేల్చిన వైద్యులు



డయేరియా వ్యాప్తిపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి ఆరోగ్య వివరాలు అడిగితెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

బొండపల్లి: మండలంలోని బిళ్లలవలస గ్రామం డయేరియాతో మంచంపట్టింది. మూడు రోజుల వ్యవధిలో 16 మంది డయేరియాతో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఎనిమిది మంది వివిధ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతుండగా, మరో ఎనిమిది మంది గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో సేవలు పొందుతున్నారు. ఈ నెల 17న పత్తిగుళ్ల దీపికకు డయేరియా లక్షణాలు కనపడడంతో విజయనగరంలోని ఘోష ఆస్పత్రికి తరలించారు. అదే రోజు పత్తిగుళ్ల రాజశేఖర్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి, వెంపడాపు పైడితల్లిని జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. 18వ తేదీన రౌతు చరణ్ తేజ, సుంకరి అప్పలనాయుడు, ఇపర్తి సీతమ్మను, 20వ తేదీ ఉదయం నక్కాన పైడమ్మకు వాంతులు, విరేచనాలు కావడంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రులకు తీసుకెళ్లారు. గ్రామంలో పలువురిలో డయేరియా లక్షణాలు కనిపించడంతో బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, సమీరాలు సచివాలయంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో సేవలందించారు. ఇంటింట సర్వే చేసి డయేరియా బాధిత లక్షణాలు ఉన్నవారికి సేవలందిస్తున్నారు. పత్తిగుళ్ల బంగారయ్య, గౌరి, అప్పారావు, పతివాడ సూర్యకళ, బూర అప్పయ్యమ్మ, రౌతు అప్పయ్యమ్మ, ఎర్రి యామిని, సుంకరి అప్పయ్యమ్మకు గ్రామంలోనే వైద్యసేవలందించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని, రోగులు కోలుకుంటున్నట్టు పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. కొందరు డిశ్చార్జ్ అయ్యారన్నారు. కలుషిత ఆహారం తినడం వల్లే డయేరియా సోకినట్టు గుర్తించామన్నారు.

గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

డయేరియా ప్రబలిన సమాచారం అందుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి జీవనరాణి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ రాణిలు గ్రామాన్ని సోమవారం సందర్శించారు. డయేరియా వ్యాప్తిపై ఆరాతీశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. డయేరియా కట్టడిలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లోరిన్ మాత్రలను ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని తాగునీటి పథకాలు, కాలువలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగిని పరామర్శించి రోగి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

ఆరు బయటే వైద్యం

గ్రామంలోని సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులకు సరైన సౌకర్యాలు కల్పనలో వైద్యసిబ్బంది విఫలమయ్యారు. ఆరుబయటే రోగులకు వైద్య సేవలు అందించడంపై గ్రామస్తులు మండిపడ్డారు. పెంట కృష్ణమ్మ, ఎర్రి యామిని తదితరులు తమ ఇంటి నుంచి తెచ్చుకున్న మంచంపైనే సచివాలయం బయట వైద్యసేవలు పొందారు. డయేరియా వ్యాప్తితో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. తాగునీటి పథకాన్ని క్లోరినేషన్ చేయడంతో పాటు, కాలువల్లో బ్లీచింగ్ చల్లి, పూడికలను తొలగించారు. తాగునీటి శాంపిల్స్‌ను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించినట్టు ఎంపీడీఓ గిరిబాల తెలిపారు.



సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆరు బయట చికిత్స పొందుతున్న వృద్ధురాలు

31 నుంచి జాతీయ గణిత సదస్సు



సదస్సు షెడ్యూల్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

విజయనగరం అర్బన్: జాతీయస్థాయి గణిత శాస్త్ర సదస్సును ఈ నెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో ఎంఆర్ అటానమస్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు తెలిపారు. స్థానిక కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సదస్సు పూర్తి వివరాల షెడ్యూల్ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరు సైన్స్ అకాడమీ ఆర్థిక సహకారంతో సదస్సు సాగుతుందన్నారు. చెన్నై మేథ్‌మెటిక్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డైరెక్టర్ ప్రొఫెసర్ రాజీవ్ కరండికల్, రిసోర్స్ పర్సన్స్ కన్వీనర్‌గా, రిసోర్స్ పర్సన్స్‌గా ఐఎంఎస్ ప్రొఫెసర్ పాంచాలి, సీఎంఐ ప్రొఫెసర్ బి.వి.రామకృష్ణ, హనుమంతు మనోజ్ వ్యవహరిస్తారని తెలిపారు. ప్రస్తుత సామాజిక పరిస్థితులకు అనుగుణంగా గణిత శాస్త్రంలో వస్తున్న మార్పులు, శాస్త్ర సాంకేతిక రంగాల గురించి వివరిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల గణిత శాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు, అధ్యాపకులు ఉమాశంకర్, ఝాన్సీ, స్వామినాయుడు, స్వాతి, రమేష్, శ్రీదేవి, ధర్మారావు, ఊర్మిల, సాంఖ్యక శాస్త్ర అధ్యాపకులు ఎం.వి.లక్ష్మి, నరేష్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ అచ్యుతరావు, సలహాదారు సూరినాయుడు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రసాద్

- రెడ్‌క్రాస్‌పై విడుదలైన స్టాంప్స్ సేకరణతో గుర్తింపు
- 177 దేశాల్లో విడుదలైన స్టాంపులు, కవర్లు సేకరణ
- గతంలో గాంధీజీపై స్టాంప్స్ సేకరణలో రికార్డు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి అందుకున్న అవార్డులతో ప్రసాద్

చీపురుపల్లి: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చీపురుపల్లి పట్టణంలోని శ్రీనివాసా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏడీఎస్‌ఎస్‌వీ ప్రసాద్ స్థానం దక్కించుకున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థపై ముద్రించిన స్టాంప్స్, కవర్స్‌ను సేకరించి అవార్డును అందుకున్నారు. 2011 నుంచి 2024 మధ్య ప్రపంచ వ్యాప్తంగా 177 దేశాల్లో రెడ్‌క్రాస్ సంస్థ పేరుతో విడుదలైన 1313 స్టాంప్స్, కవర్స్‌ను ప్రసాద్ సేకరించారు. దీనికి గాను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆయనను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసి మెడల్, ధ్రువీకరణ పత్రం, జ్ఞాపికను ఆ సంస్థ చీఫ్ ఎడిటర్ డా.బిస్వరూప్ రాయ్ చౌదరి ప్రదానం చేశారు. ప్రసాద్ గతంలో కూడా బాపూజీపై ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన స్టాంప్స్ సేకరణలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఆయనను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా

22న కబడ్డీ జట్లకు క్రీడాకారుల ఎంపిక

గంట్యాడ: విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో ఈనెల 25, 26, 27 తేదీలలో 71 వ అంతర జిల్లాల స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు జరగనున్నాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అవనాపు విజయ్, రంధి నాగేశ్వరావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు గంట్యాడ హైస్కూల్‌లో ఈనెల 22 వతేదీ మధ్యాహ్నం 2 గంటలకు కబడ్డీ జట్లను ఎంపిక చేయనున్నామని చెప్పారు. క్రీడాకారులు అధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. పురుషులు బరువు 85 కేజీలు, స్త్రీలు బరువు 75 కేజీల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారాలు ఫోన్ 9440888369,9010727069 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కదలని ఏనుగుల గుంపు



జంఝావతి రబ్బర్ డ్యామ్ సమీపంలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: మండలాన్ని గజరాజుల బాధలు వీడడం లేదు. గత కొన్నాళ్లుగా జంఝావతి రబ్బర్ డ్యామ్, రాజ్యలక్ష్మీపురం, గంగరేగువలస తదితర గ్రామా పరిసరాల్లో గజరాజుల గుంపు సంచరిస్తోంది. ఈ ప్రాంతంలో పుష్కలంగా కూరగాయల సాగు నీటి వనరులు ఉండడంతో ఈ ప్రాంతాన్ని ఏనుగులు విడిచివెళ్లడం లేదు. అటవీశాఖ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏరియాలో జొన్న, టమాటో లాంటి పంటలు సాగులో ఉండడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించే చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై దాడి

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో ఆడుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట రాయుళ్ల నుంచి రూ.7వేల510 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఏడుగురు కోడిపందెం రాయుళ్ల అరెస్టు



అరిగిపాలెంలో పట్టుబడిన కోడిపందాల రాయుళ్లు

వేపాడ: మండలంలోని అరిగిపాలెం సమీపంలో ఏడుగురు కోడిపందాల రాయుళ్లు పట్టుబడినట్లు వల్లంపూడి ఎస్సై బి.దేవి తెలిపారు. సోమవారం సాయంత్రం వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో కోడిపందెం నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,680లు ఏడు సెల్‌ఫోన్లు, ఎనిమిది ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

మంత్రి ఇలాకాలో
బెల్టు షాపుల జోరు..!

- షాపుల నిర్వహణ కోసం గ్రామాల్లో వేలం పాటలు
- నిర్వాహకులకు మంత్రి బంధువుల అండదండలు
- ప్రతి గ్రామంలో 5 నుంచి 10 వరకు బెల్టుషాపుల నిర్వహణ
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు



గంట్యాడ మండలం నీలావతిలో బెల్టు షాపు

గంట్యాడ: మండలంలోని ఓ గ్రామంలో బెల్టు షాపు నిర్వహణకు కొద్ది రోజుల క్రితం వేలం పాట నిర్వహించారు. ఆ గ్రామంలో సుమారు రూ. 5 లక్షల వరకు ఓ వ్యక్తి వేలం పాటలో పాడుకున్నట్లు సమాచారం. ఈ గ్రామంలో వేలంపాట నిర్వహించే ముందు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బంధువు ఒకరిని గ్రామస్తులు కలిసినట్లు సమాచారం. మీకు ఏమీ ఫర్వాలేదు. నేను చూసుకుంటూ..మీరు వేలం పాట పెట్టుకోండి అని సదరు బంధువు గ్రామస్తులకు అభయం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలం కేంద్రానికి అతి సమీపంలో ఉన్న మరో గ్రామంలో బెల్టు షాపు నిర్వహణకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో ఓ వ్యక్తి రూ.4 లక్షలకు బెల్టుషాపును దక్కించుకున్నట్లు తెలిసింది. దీంతో నిర్భయంగా బెల్టు షాపు నిర్వహించుకుంటున్నారు.

మండలంలోని మరో గ్రామంలో బెల్ట్‌షాపు కోసం వేలం పాట నిర్వహించారు. ఇందులో ఓ వ్యక్తి రూ.4 లక్షలకు వేలం పాట దక్కించుకున్నట్లు తెలిసింది. దీంతో ఈ గ్రామంలో కూడా మద్యం యథేచ్ఛగా విక్రయిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మూడు గ్రామాల్లో బెల్టు షాపుల కోసం వేలం పాటలు జరిగాయి. వేలం పాటలు లేకుండానే పలు గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. అధికారం ఉంది కదా అని అధికార పార్టీ నేతలే బెల్టుషాపులు ఎక్కువగా నిర్వహిస్తున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి.

గ్రామాల్లో 5 నుంచి 10 వరకు బెల్టుషాపులు

గ్రామాల్లో సందుకు ఒకటి, పుట్టకొకటి చొప్పున బెల్టుషాపులు వెలిశాయి. వేలం పాట జరిగిన గ్రామాల్లో మినహాయిస్తే మిగిలిన గ్రామాల్లో 5 నుంచి 10 వరకు బెల్టుషాపులు వెలిశాయి. కొన్ని గ్రామాల్లో 15 నుంచి 20 వరకు బెల్టుషాపులు ఉన్నాయి.

ఏటీఎంల మాదిరి బెల్టుషాపుల నిర్వహణ

గ్రామాల్లో బెల్టు షాపులు ఏటీఎం (ఎనీ టైమ్ మద్యం) మాదిరి నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి అయినా, తెల్లవారుజామున అయినా ఎప్పుడు కావాలంటే అప్పుడు విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. కొంతమంది అయితే బ్రష్ చేయడం కంటే ముందే మద్యం తాగుతున్నారు. దీన్ని బట్టి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

చంద్రబాబువి ఉత్తి మాటలే!

బెల్టు షాపులు నిర్వహిస్తే తోలు తీస్తాం, నార తీస్తాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కానీ సాక్షాత్తు జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న మండలంలోనే బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలిశాయి. కొన్ని గ్రామాల్లో బెల్టు షాపుల కోసం వేలం పాటలు కూడా నిర్వహించారు. బెల్టు షాపుల నిర్వహణకు మంత్రి అండదండలు ఉన్నాయనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

ఆకస్మిక దాడులు చేస్తున్నాం

గ్రామాల్లో ఆకస్మిక దాడులు చేసి బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం. బెల్టు షాపుల నిర్వహణ కోసం వేలం పాటలు నిర్వహించిన విషయం తెలియరాలేదు. సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

గ్రామాల్లో బెల్టుషాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నప్పటికీ చర్యలు చేపట్టాల్సిన ఎక్సైజ్‌శాఖ చోద్యం చూస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది ఎక్సైజ్ శాఖ అధికారులు అయితే ఎవరైనా బెల్టు షాపుల గురించి సమాచారం ఇస్తే ఆ సమాచారాన్ని వెంటనే బెల్టు షాపులకు చేరవేరస్తున్నారు. దీంతో వారు సమాచారం ఇచ్చిన వారిని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రతి వినతికీ పరిష్కారం చూపించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా అధికారులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి వినతికి పరిష్కారం చూపాల్సిందేనని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వినతుల పరిష్కారం జరగాలన్నారు. ఆయా వినతుల తనిఖీ సందర్భంగా అర్జీదారు సంతృప్తి చెందే రీతిలో వినతిని పరిష్కరించలేదని నిర్ధారణ జరిగితే ఆ వినతిని మళ్లీ తెరిచి సంతృప్తికర పరిష్కారం చూపించాల్సి ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ అంబేడ్కర్ పాల్గొని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, ఆర్‌డీఓ కీర్తిలతో కలిసి వినతుల స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. ప్రజావినతుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయా శాఖల జిల్లా అధికారులకు అందజేసి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారంపై 183 వినతులు అందాయి.

ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణను అడ్డుకోవాలి

చీపురుపల్లి మండలం పత్తికాయవలస గ్రామంలో లావేరు రోడ్డును ఆనుకుని ఉత్తర దిశగా ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని దాన్ని అడ్డుకోవాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ పట్ట ఎల్లయ్య కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు ఆయనతోపాటు పలువురు గ్రామస్తులు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణపై స్థానిక తహసీల్దార్, ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులకు ఈ నెల 8న ఇచ్చిన ఫిర్యాదుపై సంబంధిత అధికారులు స్పందించి చీపురుపల్లి సర్వేయర్‌తో సర్వే చేశారు. ఆర్‌అండ్‌బీ స్థలంగా రుజువు అవడంతో ఖాళీ చేయమని ఆదేశాలిచ్చారు. అయితే అధికారుల ఆదేశాలను పట్టించుకోవడం లేదని జిల్లా స్థాయిలో చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని వారు కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యలు తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి 32 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



బొలెరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ ఎస్సై రామారావు, సీఎస్‌డీటీ రాజేంద్ర తదితరులు

పార్వతీపురం: పార్వతీపురం నుంచి అలమండకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ ఎం.రాజేంద్ర తెలిపారు. సోమవారం సాయంత్రం ముందస్తు సమాచారం మేరకు మండలంలోని పెదబొండపల్లి గ్రామంవద్ద బొలెరో వాహనంలో 54 ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తున్న 2700 కిలోల పీడీఎస్ బియ్యం విజిలెన్స్ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్ బియ్యాన్ని విక్రయించినా, కొనుగోలు చేసినా, నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖరం పెద్దన్న పాత్ర పోషించారు

- ఎమ్మెల్సీలు తలశిల రఘురాం.. లేళ్ల అప్పిరెడ్డి



రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి తదితరులు

పాలకొండ రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పాలవలస రాజశేఖరం ఈ ప్రాంతానికి పెద్దన్నలా కీలకంగా వ్యవహరించారని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయ నిర్వాహకులు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, జేసీసీ కన్వీనర్ హర్షవర్ధన్ రెడ్డి తదితరులు అన్నారు. ఇటీవల మరణించిన పాలవలస రాజశేఖరం కుటుంబసభ్యులను సోమవారం వారి స్వగృహంలో పరామర్శించారు. ఈ క్రమంలో రాజశేఖరం సతీమణి ఇందుమతి, కుమారుడు, ఎమ్మెల్సీ విక్రాంత్, కుమార్తె, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతితో మాట్లాడుతూ వారి తండ్రితో వారికి ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని, కీలక సమయాల్లో పార్టీ అభ్యున్నతికి ఆయన అందించిన సలహాలు, కృషి గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు తీర్చలేదంటూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కలయికలో వారి వెంట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఏపీ టిడ్కో మాజీ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పాలవలస ధవళేశ్వరరావుతో పాటు పాలకొండ, పాతపట్నం, రాజాం నియోజకవర్గాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు ఉన్నారు. అంతకుముందు వీరు రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు తోండ్రంగి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయ సిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 21 నుంచి 23 వరకు కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు సీహెచ్.నారాయణరావు, బి.అనుపమ, జె.వెన్నెల, పి.థెరిసా, ఒ.సౌమ్య, ఎం.సౌజన్య, ఎస్.జ్యోషిత, కె.మాధురి, డి.హేమలత, ఎస్.అవినాష్, కె.కావ్య సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నెల 22 నుంచి 26 వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో, ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు ప్రతిభను చాటనున్నారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి రమేష్‌కుమార్, పీడీ సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపికైన తిరుమల కళాశాల విద్యార్థిని



కావ్యాంజలిని అభినందిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: తిరుమల నర్సింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. కళాశాలకు చెందిన ఉజ్జి కావ్యాంజలి ఈనెల 17, 18 తేదీల్లో ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సెపక్ తక్రా (లెగ్ వాలీబాల్) పోటీల్లో పాల్గొని తృతీయస్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జనవరి 22వతేదీన నంద్యాల జిల్లాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో కావ్యాంజలి పాల్గొంటుంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనందుకు ఆమెను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ అభినందిస్తూ, ఆమెకు రూ.5 వేలు నగదు బహూకరించారు.

చీపురుపల్లిలో చోరీ కలకలం

- ఒకే రోజు మూడిళ్లలో చోరీ
- కేజీ 350 గ్రాములు వెండి, 7 గ్రాముల బంగారం అపహరణ
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్



చోరీ జరిగిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎస్సై దామోదరరావు

చీపురుపల్లి: చాలాకాలం తరువాత చీపురుపల్లి పట్టణంలో జరిగిన చోరీలు కలకలం సృష్టించాయి. అందులోనూ ఒకే రోజు మూడిళ్లలో చోరీ జరగడం స్థానికంగా భయాందోళనకు దారితీసింది. పథకం ప్రకారమే దుండగులు మూడిళ్లలో ప్రవేశించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే చోరీ జరిగిన మూడిళ్లలోనూ ఎవరూ లేకపోవడం, తాళాలు వేసి ఉండడంతోనే ఆ ఇళ్లనే దుండగులు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మూడిళ్లలో చోరీలకు పాల్పడినప్పటికీ రెండిళ్లలో ఎలాంటి విలువైన వస్తువులు లభించకపోగా ఒక ఇంటిలో కేజీ 350 గ్రాములు వెండి, 700 గ్రాముల బంగారం చోరీకి గురయ్యాయి. ఆదివారం రాత్రి జరిగిన ఈ చోరీలకు సంబంధించి సోమవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఎల్.దామోదరరావు దర్యాప్తు నిర్వహించి తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు పెద్ది మహేశ్వరరావు, రామకృష్ణారెడ్డి కుటుంబాలు క్యాంప్‌లో ఉండడంతో వారి ఇళ్ల తాళాలు పగలుగొట్టి దుండగులు లోనికి ప్రవేశించారు. అలాగే కోటదుర్గమ్మవారి వీధిలో అరబిందో అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న బొత్స శ్రీహరిరావు నివాసంలో కూడా ఎవరూ లేకపోవడంతో ఇంటిలోకి దుండగులు ప్రవేశించారు. అయితే రామకృష్ణారెడ్డి, శ్రీహరిరావు ఇళ్లల్లో విలువైన వస్తువులు లేకపోవడంతో ఇళ్లను చిందరవందర చేశారు. లెక్చరర్స్ కాలనీకి చెందిన పెద్ది మహేశ్వరరావు నివాసంలో కేజీ 350 గ్రాములు వెండి, 7 గ్రాములు బంగారం అపహరించుకుపోయారు. క్లూస్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని నేరస్థుల ఆధారాలు సేకరించాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దామోదరరావు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹274

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి



పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న కేఆర్‌ఆర్‌సీ ఉప కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి తదితరులు



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీహెచ్‌వో గణేష్



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ డా.ఓ.దిలీప్ కిరణ్



సాలూరు: ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని కేఆర్‌ఆర్‌సీ ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుంచి 68 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, తద్వారా అర్జీదారు సంతృప్తి వ్యక్తం చేసేలా పరిష్కారం ఉండాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితులోను ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ రీ ఓపెన్ కారాదని అధికారులకు స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు, ఏపీఈడబ్ల్యూడీ సీఈ ఎస్ఈ లక్ష్మణరావు, డ్వామా పీడీ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 25 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 25 వినతులు వచ్చాయి. పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. హుస్సేన్‌పురం సచివాలయం నుంచి గదబవలసకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని పెద్దగదబవలసకు చెందిన ఆర్.కృష్ణ వినతి అందజేశారు. మూలగూడకు చెందిన మండల పరిషత్ స్కూల్‌కు ప్రహరీ, మరుగుదొడ్లు మంజూరు చేయాలని పి.చౌదరి కోరారు. వజ్జాయిగూడ గ్రామస్తులు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రైకార్ రుణాలు ఇప్పించాలని పలువురు కోరారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, ఏటీడబ్ల్యూవో మంగవేణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాలూరులో 139 అర్జీలు

సాలూరు: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 139 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర స్త్రీశిశుసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి, అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అవకాశమున్న సమస్యలను తక్షణమే, మిగిలిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హేమలత, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, డీఎల్‌డీఓ రమేష్‌రామన్, ఐటీడీఏ డీఈ బలివాడ సంతోష్, జీఎస్‌డబ్ల్యూఎస్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ చిట్టిబాబు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 5 ఫిర్యాదులు

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దని అదనపు ఎస్పీ డా.ఓ.దిలీప్ కిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి 5 ఫిర్యాదులు స్వీకరిచారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ–ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో అదనపు ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీతో పాటు ఎస్సై ఫకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్ల సహాయనిరాకరణ



సమావేశం అనంతరం సర్వే ఉద్యోగుల ఐక్యనినాదం

- జిల్లా ఉన్నతాధికారుల వేధింపులపై నిరసన
- డిమాండ్ల నెరవేర్చేవరకు పనిచేయమని ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రకటన



ఏడీ రమణమూర్తికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్వే ఉద్యోగులు

విజయనగరం అర్బన్: చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తూ.. ఇచ్చిన లక్ష్యాలను 90 శాతం మేర పూర్తిచేస్తున్నా సర్వే ఉద్యోగులపై జిల్లా అధికారుల వేధింపులు ఆగడం లేదని ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆరోపించింది. ఉన్నతాధికారుల వేధింపులు భరించలేకపోతున్నామంటూ నిరసన తెలిపింది. అసోసియేషన్ సభ్యులు స్థానిక కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల వేధింపుల ఆపకుంటే పనిచేయలేమని తేల్చిచెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయానికి వినతి పత్రం పంపించాలని నిర్ణయించారు. ఇటీవల ఐదుగురు మండల సర్వేయర్లను, ఇద్దరు సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీచేయడాన్ని తప్పుబట్టారు. సమీక్ష సమావేశాల్లో హేళనగా దుర్భాషలాడారని, మానసిక వేదనకు గురిచేసిన అధికారులు బేషరతుగా సర్వే ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని, ఇప్పటికే జారీ చేసిన మెమోలు, షోకాజ్ నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, రీ సర్వే గ్రామ సభల్లో వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన నిర్దేశిత వ్యవధి ప్రకారం పూర్తిచేయడానికి అవకాశం ఇవ్వాలని తీర్మానించారు. న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చే వరకు 'సహాయ నిరాకరణ' చేపడతామని దాదాపు 200 మంది సంతకాలతో ప్రకటించారు. సంఘ అధ్యక్షుడు వెంకటరావు చౌదరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా వ్యాప్తంగా 27 మండలాల నుంచి సర్వే ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం సర్వే శాఖ ఏడీ రమణమూర్తికి వినతి పత్రాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా, పనితీరు బాగులేని సిబ్బందికి మాత్రమే షోకాజ్ నోటీసులు పంపామని, దీనిపై ఆందోళన లేవనెత్తిన సంఘ అధ్యక్షుడు వెంకటరావు చౌదరిని ప్రభుత్వానికి సరెండర్ చేసినట్టు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.